క్లుప్తంగా

ఘనంగా ప్రారంభమైన గంగమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దేవత

మైదుకూరు : మండలంలోని శివపురంలో గ్రామ దేవత గంగమ్మ తిరునాల శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయంలో గంగమ్మ మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన రేలా రే రేలా కార్యక్రమం అలరించింది. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జగన్‌పై విద్వేష వ్యాఖ్యలు తగదు

ఖాజీపేట : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకులు చేస్తున్న విద్వేష వ్యాఖ్యలు తగదని ఏపీఎస్ ఆర్టీసీ కడప మాజీ జోనల్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి హితవుపలికారు. దుంపలగట్టు గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని వ్యాఖ్యానించారు. ఆత్మగౌరవం కోసమే వైఎస్సార్‌సీపీలో చేరారని, పార్టీ కోసం కోసం రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తామని ప్రకటించారు. జీవితాంతం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితోనే ఉంటానని స్పష్టం చేశారు.

మూకుమ్మడి రాజీనామా

అట్లూరు: అట్లూరు సహకారపరపతి సంఘం అధ్యక్షుడు ముడమాల ప్రభాకర్‌రెడ్డితో పాటు సభ్యులు కత్తి పెంచలయ్య, చాట్ల చిన్నయ్య తమ పదవులకు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ (డీసీఓ) సుబాషిణికి పంపారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పదవులు ముఖ్యం కాదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం పనిచేస్తామని ప్రకటించారు. కూటమి అధికారంలోకి రావడంతో రాజీనామా చేశామని తెలిపారు.

నివాళి



ఈశ్వరరెడ్డి భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: మండలంలోని రాజాసాహెబ్‌పేట మాజీ సర్పంచ్ బిజివేముల ఈశ్వర్‌రెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. పీఆర్ఆర్‌డీ రాష్ట్ర మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి ఆయన భౌతికకాయాయానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ఈశ్వర్‌రెడ్డితో అనుబంధం ఉందన్నారు. ఆయన మంచి స్నేహశీలి అని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు.

వృద్ధుడికి అంతిమ సంస్కారాలు



అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అమ్మానాన్న వృద్ధాశ్రమంలో శనివారం ఒంటేరు నారాయణ అనే వృద్ధుడు మృతి చెందాడు. అంతిమ సంస్కారాలు చేయడానికి ఎవరూ ముందుకు రాక పోవడంతో వృద్ధాశ్రమం నిర్వాహకులు మే ఐహెల్ప్‌యూ ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణరావుకు సంప్రదించారు. దీంతో వృద్ధుని మృతదేహానికి హిందూ స్మశాన వాటికలో ఫౌండేషన్ చైర్మన్‌తో పాటు భార్గవ్‌సాయి, సుబహాన్, మునేంద్ర, కృప, ఫరూన్, లక్ష్మమ్మ తదితరులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణం



మల్లిఖార్జునను సన్మానిస్తున్న మేనేజర్ నాయక్

రాజుపాళెం : ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని ఆంధ్రప్రగతి బ్యాంకు మేనేజర్ రంజిమ్ నాయక్ పేర్కొన్నారు. రాజుపాళెంలోని ఏపీజీబీలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మల్లిఖార్జున కడపలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో శనివారం ఆ బ్యాంకులో మేనేజర్‌తో పాటు రాజుపాళెం వెలుగు సీసీ రత్నాకర్‌కు సన్మానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కిషోర్, క్యాషియర్ మౌనిక, గోనా నాగేశ్వరరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బ్యాంక్ సిబ్బంది భాస్కర్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వెజిట్రబుల్స్

- ఘాటెక్కిన పచ్చిమిర్చి
- అదే బాటలో టమాటా, బెండకాయలు, బీరకాయలు
- దళారుల చేతివాటం
- గగ్గోలు పెడుతున్న వినియోగదారులు

కూరగాయల ధరలు వామ్మో అనిపిస్తున్నాయి. అదీ, ఇదీ అని లేదు దాదాపు అన్ని కూరగాయల ధరల్లోనూ భారీ పెరుగుదల కనిపిస్తోంది. పచ్చిమిర్చి ఘాటెక్కి రూ. 100 దాటేసింది. టమాటాది కూడా అదే దారి. వంకాయలు, బెండకాయలు, దొండకాయలు ... ఇలా ఏ కాయగూర అయినా ధర బేజారెత్తిస్తోంది. కూరల్లో సామాన్యులు ఎక్కువగా వినియోగించే వంకాయల ధరలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి.



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

కాశినాయన: కూరగాయల ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. ఈ ఏడాది దిగుబడి తగ్గడం, రవాణా ఛార్జీలు పెరగడం ధర పెరుగుదలకు కారణమని వ్యాపారస్తులు చెబుతున్నారు. అయితే కూరగాయల పంటలు పండిస్తున్న రైతులకు ఏమాత్రం గిట్టుబాటు లభించడం లేదంటున్నారు. దళారులు రైతుల వద్ద తక్కువ రేటుకు కొని ఎక్కువ ధరకు వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నారు. పెరిగిన ధరలతో సామాన్యులు కూరగాయలు కొనడానికి భయపడుతున్నారు. కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల మండలాల్లోని పలు గ్రామాల్లోని రైతులు కూరగాయల పంటల సాగు అధికంగా సాగు చేస్తారు. అయితే వ్యాపారస్తులు రైతుల తోట వద్దకు వెళ్లి కూరగాయలను కొంటున్నారు. దీంతో రైతుకు కూడా మార్కెట్‌కు చేర్చేందుకు రవాణా ఛార్జీలు తగ్గుతాయని భావించి అక్కడే విక్రయిస్తున్నారు. దగ్గరలోని పోరుమామిళ్ల మార్కెట్‌కు రైతులు తీసుకెళితే అక్కడ మార్కెట్ వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి దళారులు మళ్లీ గ్రామాల్లోకి వచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలతో సామాన్యులు అవస్థలు పడుతున్నారు. కిలో టమాటా రూ.70, మిర్చి రూ.90, బీరకాయలు రూ.80, బంగాళదుంప రూ.50, ఉల్లిగడ్డలు రూ.45, క్యారెట్ రూ.80, చిక్కుడు రూ.60ల వంతున మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ధరల పెరుగుదలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

శబ్దంపై పట్టు శ్రీశ్రీ సొత్తు



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హనుమంతరావు

బద్వేలు అర్బన్ : 20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) శాసించారని ప్రముఖ సాహితీవేత్త, రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు కొనియాడారు. స్థానిక మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో శ్రీశ్రీ 41వ వర్ధంతి సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శబ్దంపై పట్టు శ్రీశ్రీ సొత్తు అని, సబ్బుబిళ్ల, అగ్గిపుల్ల, కుక్కపిల్లను సైతం తీసుకుని హృదయాన్ని కదిలించే కవిత్వం చెప్పే శక్తి శ్రీశ్రీకే ఉందని ప్రశంసించారు. శ్రీశ్రీ సాహిత్యంలో అన్ని ప్రక్రియలు స్పృశించి మహాప్రస్థానం, ఖడ్గసృష్టి వంటి మరికొన్ని శతకాలు రాసిన సిద్ధహస్తుడని శ్లాఘించారు. విప్లవకవిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా, సినిమా పాటల రచయితగా బహుముఖంగా ప్రసిద్ధులయ్యారన్నారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో భాగ్యరత్న ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్, పూలే ఆశయసాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బాలయ్య, రాజగోపాల్, ఆవాజ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్వర్‌బాష, పట్టణ అధ్యక్షుడు సత్తార్, కళాపీఠం సభ్యులు సుధీర్, ఆవులరమణ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో

శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ యువతకు చైతన్యస్ఫూర్తి శ్రీశ్రీ రచనలు అని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, నాగార్జున, పట్టణ నాయకులు ప్రవీణ్‌కుమార్, యువరాజ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పుష్పయాగం



బద్వేలు అర్బన్ : స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు



బద్వేలు అర్బన్ : స్వామి, అమ్మవార్లకు అశ్వవాహనసేవ నిర్వహిస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండా వధూతాశ్రమం గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆరు రోజులుగా జరుగుతున్న ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం మహాపూర్ణాహుతి నిర్వహించి స్వామి, అమ్మవార్లను అశ్వవాహనంపై ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించి శాస్త్రోక్తంగా చక్రస్నానం చేయించారు. సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించి అనంతరం ఆలయంలో అంగరంగ వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. అందులో భాగంగా వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రతనాల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు విశేష పూజలతో పాటు, శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేసి కర్పూర హారతులు ఇచ్చారు. భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జేష్ఠ మాసం రెండవ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రత్యేక అలంకరణలో రతనాల వేంకటేశ్వరుడు



గోపవరం : ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : మండల పరిధిలోని గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్లో 7, 8, 9 తరగతుల్లో ఇంగ్లీషు మీడియంలో ఖాళీగా వున్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో 18 సీట్లు, 8వ తరగతిలో 3 సీట్లు, 9వ తరగతిలో ఒక సీటు ఖాళీగా వుందని తెలిపారు. అర్హత గలిగి ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 21వ తేదీ లోపు పాఠశాలలో స్వయంగా తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 23న స్థానిక పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తారన్నారు. పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్లను అనుసరించి సీట్లు కేటాయిస్తారన్నారు.

కన్నుల పండువగా ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి

ఖాజీపేట : శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు మాజీ ఆప్కో చైర్మన్ గుజ్జల శ్రీనివాసుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

సమస్యల పరిష్కారానికి వేదిక లోక్ అదాలత్

ముద్దనూరు: ఇరు వర్గాల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌ను వేదికగా వినియోగించుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి మెజిస్ట్రేట్ భార్గవి తెలిపారు. శనివారం మండలంలోని కొత్తపల్లెలో ఆమె న్యాయ విజాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఈనెల 29వ తేదీన లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టాలపై అవగాహన కల్పించడానికే న్యాయ వ్యవస్థ ప్రజల ముందుకు వచ్చిందన్నారు. చిన్నసమస్యలను పెద్ద మనుషుల ద్వారా పరిష్కరించుకోవాలని, భూముల క్రయవిక్రయాలలో మోసాలను గ్రహించాలని జడ్జి సూచించారు. సీఐ దస్తగిరి, ఎంపీడీవో చంద్రమౌళి పాల్గొన్నారు.

పంచాయతీల్లో బిల్లులు నిలిపేయండి

అధికారులకు ఎమ్మెల్యే వరద లేఖ

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను నిలిపివేయాలని టీడీపీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మండల పరిషత్ అధికారులకు లేఖ రాశారు. 2019 నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేయిస్తానన్నారు. అప్పటి వరకు పంచాయతీల్లో కొత్తగా చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి ఎస్టిమేట్స్, కొటేషన్లు ఇవ్వొద్దని అధికారులకు సూచించారు.

వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను టార్గెట్‌గా చేసుకుని ఎమ్మెల్యే ఈ విధంగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. ప్రొద్దుటూరు మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు సంబంధించి మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు మెజారిటీ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ నేతలే ఉన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 రోజులు కాక మునుపే టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేశారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఇంకా ప్రమాణ స్వీకారం కూడా చేయకపోవడం గమనార్హం.

గోవధ నిషేధ చట్టం అమలు చేయాలి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గాలి హరిప్రసాద్, తదితరులు

వేంపల్లె : పట్టణంలో గోవధ నిషేధ చట్టం అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు. శనివారం పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోవులలో సకల దేవతలు కొలువై ఉన్నారని శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. అలాంటి శాస్త్రాలను హిందూ సమాజం పాటిస్తూ వస్తోందన్నారు. గోహత్య మహాపాతకమని, గోవుల అక్రమ రవాణా, గోవధ పశుసంరక్షణ చట్టం 1977 ప్రకారం ఏ ప్రాంతంలో కూడా గోవులను వదించడం అక్రమంగా తరలించడం వంటి పనులు చేయకూడదనే ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. సదరు ఆదేశాలు పట్టణంలో అమలు పరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హిందూవుల మనోభావాలను గౌరవించాలని అధికారులను కోరామన్నారు. రానున్న బక్రీదు పండుగ దృష్ట్యా గోవదలాంటి చర్యలకు ఎవరూ పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

జమ్మలమడుగు : ఆడపిల్లలను కాపాడుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ తెలిపారు. శనివారం పట్టణంలోని శంకర్ నర్సింగ్ హోం ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్కానింగ్ రూంలో జరుగుతన్న స్కానింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కడుపులో ఆడపిల్ల పెరుగుతుందని చాలా మంది గర్భస్థ శిశువులను ఆబార్షన్ ద్వారా తొలగిస్తున్నారని అలాంటి వారు ఎవరైనా ఆసుపత్రికి వస్తే వారికి వైద్యులు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. వైద్యులు స్కానింగ్‌లో చేసి లింగ నిర్ధారణ చేయడం చట్ట రీత్యానేరం అవుతుందన్నారు. వైద్యులు లింగ నిర్ధారణ చేసినట్లు అయితే వారికి జైలు శిక్షతోపాటు సర్టిఫికేట్‌లను రద్దుచేస్తారని హెచ్చరించారు.

రక్తపరీక్షల కిట్లు పంపిణీ

సింహాద్రిపురం : సింహాద్రిపురం, బిదినంచెర్ల, కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మలేరియా, డెంగ్యూ నిర్ధారణ చేయు పరీక్షల కిట్లు, దోమల నివారణకు సైపనోత్రిన్, లార్వా నివారణ కొరకు అబేట్, బిటీఐ పారాసిటమాల్ మాత్రలను శనివారం సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య వైద్యులకు అందజేశారు. 10 రోజుల నుంచి వర్షాలు పడుతుండటంతో ముందు జాగ్రత్త చర్యగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మలేరియా, డెంగ్యూ, లార్వా నివారణ, దోమల నివారణకు సంబంధించిన మందులు, రసాయనాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లైతే ప్రతి ఆశా కార్యకర్తవద్ద మలేరియా నిర్ధారణ చేయించుకోవాలని సూచించారు.

సేంద్రీయ పద్ధతిలో కూరగాయల సాగు



సేంద్రీయ పద్ధతిలో కూరగాయలను సాగుచేస్తున్న రైతు

తొండూరు : మండలంలోని గంగాదేవిపల్లె గ్రామ రైతులు సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు సాగుచేస్తున్నారు. ఎరువులు, పురుగుల మందులతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడంతో రోజురోజుకు అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. తద్వారా అందరి దృష్టి సేంద్రీయ వ్యవసాయంపై పడింది. రసాయనాలు లేని వ్యవసాయ ఉత్పత్తుల కోసం అనేక మంది రైతులు ప్రకృతి వ్యవసాయం అవలంభిస్తున్నారు. భూమిలో ఎరువులు, పురుగుల మందులు వాడకుండా ప్రకృతి సిద్ధంగా పంటలు పండిస్తూ సొంత మార్కెటింగ్‌తో లాభాలబాట పట్టారు. మండలంలో అధిక సంఖ్యలో గంగాదేవిపల్లె గ్రామంలో రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కడప అర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) కడప బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ టి.గిరిధర్ అన్నారు. శనివారం గిరిధర్ ఆధ్వర్యంలో కడప బ్లడ్ బ్యాంక్‌లో కడప రిమ్స్, ఫాతిమా మెడికల్ వైద్య కళాశాల వైద్యులు, వైద్య విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. 32 యూనిట్ల రక్తదానం చేసి తమ మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర, రిమ్స్ అనస్తీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బద్రి శ్రీనివాసులు, డాక్టర్స్ అమానుల్లా, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ సాదిక్, డాక్టర్ మధుసూదన్, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్‌వాడీ కార్యకర్తలు అన్ని అంశాల్లో అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని శిశుగృహ మేనేజర్ కుమారి తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని కొండాయపల్లెలోగల మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమారి మాట్లాడుతూ దత్తత కార్యక్రమాన్ని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ద్వారా నిర్వహించడం జరుగుతోందన్నారు. పిల్లలు లేని వారికి దత్తత అనేది ఒక వరం లాటిందన్నారు. అటువంటి వరాన్ని ప్రభుత్వం అందించడం సంతోషదాయకమన్నారు. చిన్నారులను నియమ నిబంధనల ప్రకారం చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని ఆమె సూచించారు. ఎస్ఐసీ ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణ ప్రతిరూప్ మాట్లాడుతూ బాలల న్యాయ చట్టం గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబుచాన్ మాట్లాడుతూ పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడంద్వారా శారీరక, మానసిక ఎదుగుదల జరుగుతుందన్నారు.

కొండాపురంలో రైళ్లు ఆపండి



రైల్వే అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొండాపురం : కొండాపురంలో అన్ని రైళ్లు ఆపాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు శనివారం రైల్వేస్టేషన్‌లో ప్రజాసంఘాల నాయకులతో కలసి రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. కరోనా నేపథ్యంలో కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఆగే అన్ని రైళ్లను రద్దు చేశారని వాటిని పునరుద్ధరించాలన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి



బద్వేలు అర్బన్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



పోరుమామిళ్ల: ఎమ్మెల్యేను సత్కరిస్తున్న రంగసముద్రం నాయకులు

బద్వేలు అర్బన్ : పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆదేశించారు. స్థానిక ఎన్‌జీఓకాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శనివారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీకి బృహత్తర తాగునీటి పథకం ద్వారా నీరు అందించే బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో నీరు తగ్గిన నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని అధికారులను సూచించారు. మున్సిపాలిటీలో గతంలో ఉన్న చేతిబోర్లకు మరమ్మత్తులు చేయించి అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. అలాగే పట్టణంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా పట్టణ జనాభాకు అనుగుణంగా అదనంగా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కోరారు. అనంతరం బద్వేలు ఎమ్మెల్యేగా రెండవసారి గెలుపొందిన ఎమ్మెల్యే డాక్టర్ సుధను మున్సిపాలిటీ పాలకవర్గం తరపున అభినందించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక మైదుకూరురోడ్డులోని పాత గుంతపల్లె పంచాయతీ కార్యాలయం స్థలంలో ఏర్పాటు చేసిన పెట్రోలు బంకును ఈ నెల 26న ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం ఆయా వార్డులలో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకురాగా తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు గోపాలస్వామి, ఆర్.వి.సాయికృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, డీఈ సుమన్‌రెడ్డి, ఏఈలు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

పోరుమామిళ్ల: బద్వేలు శాసనసభ్యురాలుగా రెండవ దఫా విజయం సాధించిన డాక్టర్ సుధను శనివారం రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమెను కలసి శాలువాతో సత్కరించి, బొకే అందచేశారు. ఈ సందర్భంగా రవిప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రమంతటా ఏకపక్షంగా కూటమి అభ్యర్థులే గెలుపొందగా బద్వేలు నియోజకవర్గంలో ఆ గాలిని తట్టుకొని నిలబడి డాక్టర్ సుధ మంచి మెజారిటీతో విజయం సాధించారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరూ రంగసముద్రం పంచాయతీ గిరినగర్‌కు చెందిన వారైనప్పటికీ ఆ పంచాయతీలో వైఎస్సార్‌సీపీకే మెజారిటీ రావడం ఆనందంగా ఉందన్నారు. ఎంపీటీసీలు మహబూబ్‌పీరా, చెంద్రాయుడు, యువజన నాయకుడు గిరిప్రణీత్‌రెడ్డి, నాయకులు రుద్రవరం నాగేంద్రప్రసాద్, సురేష్‌బాబు, శ్రీరాంరెడ్డి, నారాయణరెడ్డి, మాలకొండయ్య, నరసింహాచారి, రామసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

గోపవరం : స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరిపుల్లయ్యను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ పరామర్శించారు. ఇటీవల పుల్లయ్య గుండెకు సంబంధించిన సమస్య రావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఆయన స్వగ్రామమైన నూరేపల్లెకు వెళ్లి పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ కలువాయి లక్ష్మిదేవి, బద్వేలు కో ఆప్షన్ సభ్యురాలు ముంతాజ్, కలువాయి రమణారెడ్డి ఉన్నారు.